RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌చార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
94940 54338

RANGAREDDY, EDITION : 01, VOLUME :176 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 10 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 176 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 10 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## ఎంపి, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరగా విచారించాలి

- హైకోర్టులకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: ప్రజా ప్రతినిధులపై నమోదైన తీవ్రమైన నేరాల (క్రిమినల్ కేసులు) విచారణలను వేగంగా పూర్తి చేసేందుకు కచ్చితమైన, ఏకరీతి మార్గదర్శకాలు రూపొందించడం క్లిష్టమైన ప్రక్రియ అని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అటువంటి కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి చర్యలు తీసుకునే బాధ్యతను హైకోర్టులకు అప్పగించింది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఎంపి, ఎమ్మెల్యేలు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధించాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రజా ప్రతినిధులపై దాఖలైన క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించాలని హైకోర్టులను ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర

మిగతా 2లో

# బీఆర్ఎస్‌తోనే 'సంక్షేమం'

## బీఆర్ఎస్ కామారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గాల అభ్యర్థి, సీఎం కేసీఆర్




గజ్వేల్ - ప్రభాత సూర్యుడు

పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సంవత్సరంలోపు పూర్తిచేసి ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలకు నీటిని అందిస్తామని కామారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్ అన్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు పరిశ్రమలు, విద్యాసంస్థలు ఎన్నో వస్తాయని, కామారెడ్డి నియోజకవర్గం రూపురేఖలు మారతాయని చెప్పారు. 1956 ఉమ్మడి రాష్ట్రంలో 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' అని సిటీ కాలేజీ విద్యార్థులు ధర్నా చేస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడుగురు విద్యార్థులను కాల్చి చంపిందని

మిగతా 2లో

## 30 వరకు చంద్రబాబును అరెస్టు చేయొద్దు

- ఫైబర్ కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా
- దీపావళి తరువాతే స్కిల్ కేసుపై తీర్పు : సుప్రీం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: ఫైబర్ నెట్ కేసులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును ఈ నెల 30 వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ కేసులోనూ 17ఎ ఉన్నందున స్కిల్ డెవలప్‌మెంటు కేసు తీర్పు వచ్చిన తరువాతే, ఈ కేసు విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. కేసు ముగిసేవరకు అరెస్టు చేయొద్దన్న నిబంధన కొనసాగించాలని చంద్రబాబు

మిగతా 2లో

# త్వరలోనే రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం


కొడంగల్- ప్రభాత సూర్యుడు

ఓటుకు నోటు కేసులో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి త్వరలోనే జైల్‌కు వెళ్లడం ఖాయమని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గతంలో 'ఓటుకు నోటు.. ఇప్పుడు సీటు రేటు' అంటూ రేవంత్‌పై ఘాటు విమర్శలు చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని మరోసారి

### కొడంగల్ రోడ్ షోలో మంత్రులు : కేటీఆర్

కొడంగల్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రమోషన్ పక్కాగా ఇప్పిస్తామన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే కరెంటు పోయిందని ఎద్దేవా చేశారు. కర్నాటక రైతులు కొడంగల్‌కు వచ్చి తాము కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామంటూ ధర్నా చేశారని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం కోసం 24 గంటల ఉచిత కరెంటును ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాదని.. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రధాని మోడీ రూ.400 గ్యాస్‌ను రూ.1200 వందలకు పెంచారని గుర్తు చేశారు. రెండేండ్లలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను కొడంగల్‌కు తీసుకొచ్చి.. 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నరేంద్ర మోడీ దండయాత్ర చేస్తున్నారన్నారు. ఎవరు వచ్చినా భయపడేది లేదన్నారు. రేవంత్‌రెడ్డికి ఓట్లు వేస్తే కొడంగల్‌ను ప్లాట్లు చేసి అమ్ముతారని తెలిపారు. కోటి రూపాయలతో .

మిగతా 2లో



## ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమల్లో కేసీఆర్

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

తడిబట్టలతో ప్రజల గొంతు కోసే రకం కేసీఆర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 70 నుంచి 80 మంది దాకా తమ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారనీ, మిగతావారు శుక్రవారం వేస్తారని తెలిపారు. గురువారం సాయంత్రం హెూటల్ కత్రియాలో పలువురు అభ్యర్థులకు బీ-ఫామ్‌లు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బీసీ సీఎం ప్రకటనకు మంచి స్పందన వస్తున్నదనీ, యువత మద్దతు తమకుందని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాఫియా మారి ప్రజలను వణికిస్తున్నారని ఆరోపించారు. డబ్బులతోనే ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమల్లో కేసీఆర్ ఉన్నారనీ, ఆయనకు ప్రజలపై నమ్మకం లేదని చెప్పారు. తెలంగాణ ఆర్థిక మూలాలను దెబ్బతీసే పనిలో ఆయన ఉన్నారని విమర్శించారు. కర్నాటకలో ప్రజలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందన్నారు. రాష్ట్రాన్ని

మిగతా 2లో

# కాంగ్రెస్ అంటే నమ్మకం..!

## టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

పాలకుర్తి- ప్రభాత సూర్యుడు

ఇచ్చిన మాట తప్పకుండా కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఇస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకొని దాచుకుంటుందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తెలిపారు. నీళ్లు నిధులు నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తింద న్నారు. ఇక మూడవసారి కూడా కేసీఆర్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అమ్ముకొని కొల్లగొడతాడని స్పష్టం చేశారు. నవంబర్ 30న జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా సభా వేదికపై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హనుమాండ్ల యశస్విని రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో నిండిన పాలకుర్తి ప్రజలను చూస్తుంటే దొరల గడీలను బద్దలు కొట్టడం ఖాయమనిపిస్తోందని అన్నారు. 1200 మంది ఆత్మబలి దానాలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని





అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు రాచరిక పాలనను కొనసాగిస్తూ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అక్రమ కేసులను కొట్టివేయిస్తామని భరోసా ఇచ్చారు.

దయాకర్‌రెడ్డి తన 40 ఏండ్ల రాజకీయ జీవితంలో డీలర్ నుంచి డాలర్లకు ఎదిగారని, పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను పూర్తి చేయకుండానే రూ.250 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నమ్మక ద్రోహి, మిత్ర ద్రోహి అని దయాకర్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. శుత్రువులతో చేతులు కలిపి, కుట్రలు చేసి తనను జైలుకు పంపించాడని, దయాకర్‌రావు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పాలకుర్తి గడ్డపై ఈ సారి ఓటమి తప్పదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనను అంతమొందించేందుకు టీడీపీ శ్రేణులు కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. పేదలకు

మిగతా 2లో

# త్వరలోనే రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు సర్పంచులను కొనాలని చూసిన రేవంత్ రెడ్డిని డబ్బులతో పోలీసులకు పట్టించిన సర్పంచ్ నరసింహను అభినందించారు. అన్యాయంగా సంపాదించిన డబ్బుతో లీడర్లని కొంటున్నావు కానీ.. కొడంగల్ ప్రజలను మాత్రం కొనలేవని అన్నారు. తెలంగాణ రైతులు దేశానికి అన్నం పెడుతున్నారని అన్నారు. 93 లక్షల రేషన్ కార్డుదారులకు రూ.5లక్షల కేసీఆర్ బీమా, రైతుబంధు రూ.16 వేలకు పెంపు, ఆరోగ్య శ్రీ రూ.15 లక్షలకు పెంపు, సౌభాగ్య లక్ష్మీ పథకం కింద ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.3000, ఆసరా పింఛన్లను విడతల వారీగా రూ.5వేలకు పెంచుతామంటూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. సభ అనంతరం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సభలో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30 వరకు చంద్రబాబును అరెస్టు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా.. ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా, గత హామీ మేరకు ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్ తెలిపారు. ఈ కేసు విచారణ నవంబరు 30న చేపడతామని, అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టు చేయొద్దని ఆదేశించింది. ఏపి స్కిల్ డెవలప్‌మెంటు కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై దీపావళి పండగ తరువాత తీర్పును వెల్లడిస్తామని ధర్మాసనం వెల్లడించింది. ఈ నెల 11 నుంచి 19 వరకు దీపావళి సెలవులు కాగా, 20న సుప్రీంకోర్టు పున:ప్రారంభం కానుంది.

## ఎంపి, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరగా విచారించాలి

(మొదటి పేజీ తరువాయి)

విచారణ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన లేదా ప్రధాన న్యాయమూర్తి నియమించిన ధర్మాసనం ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయాలని, కేసులను జాబితా చేయాలని పేర్కొంది. ఈ కేసులు ఏడాది లోపే పరిష్కరించాలని హైకోర్టులను ఆదేశించింది. క్రిమినల్ కేసుల సత్వర విచారణకు అవసరమైన పర్యవేక్షణ కోరుతూ సుమోటో కేసులు నమోదు చేయాలని హైకోర్టులను ధర్మాసనం ఆదేశించింది. ట్రయల్ కోర్టులు అత్యవసరమైతే తప్ప ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల విచారణలు వాయిదా వేయకూడదని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. కేసుల సత్వర పరిష్కారానికి వెబ్‌సైట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించింది. కేసుల వివరాలను జిల్లా, ప్రత్యేక న్యాయస్థానాల నుంచి సేకరించి హైకోర్టు వెబ్‌సైట్‌లో ప్రత్యేక ట్యాబ్ ఏర్పాటు చేసి అందులో పొందుపరచాలని హైకోర్టులకు సూచించింది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికతను జిల్లా న్యాయస్థానాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. దోషిగా తేలిన ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధంపై విచారణ జరుపుతామని, ఈ అంశంపై ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

## ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమల్లో కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఆదుకునే, ఆర్థిక స్థితిని గాడిన పెట్టే శక్తి బీజేపీకి మాత్రమే ఉందన్నారు. 11న మోడీ హైదరాబాద్‌కు వస్తున్నారనీ, ఆయన మరో రెండు, మూడు సభల్లో పాల్గొంటారని చెప్పారు. అమిత్‌షా రోడ్డు షో ఉంటుందనీ, నేతలే ప్రజల వద్దకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. దీపావళి రోజు బూత్ స్థాయిలో ప్రతి గడపకూ వెళ్తామన్నారు. కొన్ని సంస్థలు సెల్‌ఫోన్లలో సర్వేలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. తప్పుడు, దొంగ సర్వేలను నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఐటీ అధికారులు తమ పని తాము చేసుకుంటూ పోతున్నారనీ, తమకేమీ సంబంధం లేని చెప్పారు. ఐటీ అధికారులు దాడి చేస్తారని పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ముందే ఎలా తెలుసని ప్రశ్నించారు.

## పెన్షన్లపై శుభవార్త చెప్పిన సీఎం కేసీఆర్..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కామారెడ్డిలో నామినేషన్ వేసిన అనంతరం సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గంలోనే మా సొంత తల్లిగారి ఊరు అని చెప్పుకొచ్చాడు. కామారెడ్డికి తనకు చిన్నప్పటి నుంచే అనుబంధం ఉంది. నేను కామారెడ్డికి వస్తే చాలా వస్తాయి. కేసీఆర్ వెంట కామారెడ్డి, ఎల్లారెడ్డికి కాళేశ్వరం నీళ్లు వస్తాయి. బీడీ కార్మికులందరికీ పెన్షన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు . కామారెడ్డి నియోజకవర్గంలో పల్లెలను అభివఅద్ధి చేయాలని గంప గోవర్ధన్ కోరడంతో తాను కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. బీడీ కార్మికుల పెన్షన్ కూడా రూ.5వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇండియాలో 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నా తెలంగాణ తప్ప ఎక్కడా పెన్షన్ ఇవ్వడం లేదు. కటాఫ్ డేట్ 2014 వరకు పెట్టడంతో కొత్త వారికి పెన్షన్ రావడం లేదని కొందరూ ఆందోళన చేస్తున్నారు. కొత్త బీడీ కార్మికులు లక్ష మంది ఉంటారు కావచ్చు. వారందరికీ బీడీ పెన్షన్ మంజూరు చేస్తాం. పెన్షన్ రూ.5వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు.

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేశారు. కేంద్రం నుంచి 157 మెడికల్ కాలేజీలు ప్రకటించి తెలంగాణకు ఒక్కటీ ఇవ్వలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ గురువారం తొలుత గజ్వేల్‌లో నామినేషన్ వేసి, అనంతరం కామారెడ్డిలో వేశారు. ఈ సందర్భంగా కామారెడ్డిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నీరు, నిధులు లేక వ్యవసాయ బోర్ మోటార్లు 20 రోజులకు, నెలకోసారి కాలిపోయేవని, వాటిని రిపేర్ చేయించేందుకు రైతులు చాలా కష్టపడేవారన్నారు. తెలంగాణ వచ్చాక 24 గంటలు కరెంటు ఇవ్వడంతో ఆ సమస్య లేదన్నారు. దేశంలో 16 రాష్ట్రాల్లో 16 లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారని, కేవలం మన రాష్ట్రంలోనే బీడీ కార్మికులకు జీవన భృతి ఇస్తున్నామని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం రైతుల బోర్ల వద్ద మీటర్లు బిగించాలని చెప్తే 'నేను చావనైన చస్తా.. కానీ రైతుల వ్యవసాయ బోర్ల వద్ద మీటర్లు బిగించను.. అని చెప్పాను. దాంతో మనకు కేంద్రం నుంచి రావాల్సిన రూ.25 వేల కోట్లను నిలిపివేసింది.' అని తెలిపారు. ఓట్ల కోసం బీజేపీ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఈ విషయాలు అడిగి నిలదీయాల న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని రద్దుచేస్తామంటున్నారని, అలా జరిగితే.. తిరిగి పట్టా మార్పిడి అధికారమంతా ఆర్డీఓ, ఎంఆర్ఓ, ఆర్ఐ, వీఆర్ఓల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు.

33 వేల కోట్ల చేపలను మన దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని మత్స్యకారులు ఉపాధిని పొందుతున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ జీవించి ఉన్నంతకాలం తాను తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. తనను గంప గోవర్ధన్ చాలాసార్లు కామారెడ్డి నుంచి పోటీ చేయాలని కోరారని, తన హయాంలో అభివృద్ధి చేస్తున్నానని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా కామారెడ్డికి వస్తే కామారెడ్డి మరింత అభివృద్ధి చెందుతుందని అనడంతో తాను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు.

మా అమ్మ పుట్టిన ఊరు కామారెడ్డి నియోజకవర్గంలోని బీబీపేట్ మండలంలోని కోనాపూర్ గ్రామం అని, గతంలో దాన్ని గోసానిపల్లి అని పిలిచేవారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సభలో ఎంపీ కే. కేశవరావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ముదిరాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, కామారెడ్డి జిల్లా పరిషత్ చైర్మెన్ దఫేదర్ శోభ రాజు, వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్, ఫుడ్ కార్పోరేషన్ మాజీ చైర్మెన్ తిరుమలరెడ్డి, ఐసీడీసీఎంఎస్ వైస్ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి, బీబీపేట్ వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటే నమ్మకం..!

(మొదటి పేజీ తరువాయి)

న్యాయం జరగాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా.. కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. ఝాన్సీ రెడ్డికి భారతదేశ పౌరసత్వం రాకుండా ఎర్రబెల్లి దయాకర్ రావు అడ్డుకున్నారని, ప్రజల అండను, నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఝాన్సీ రెడ్డి తన కోడలు యశస్విని రెడ్డిని రాజకీయాల్లోకి తీసుకు వచ్చారని తెలిపారు.


తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తుందని నిరూపిస్తే నాతోపాటు యశస్విని రెడ్డి నామినేషన్‌లను ఉపసంహరించు కుంటామని, నిరూపించక పోతే సీఎం కేసీఆర్.. ప్రొఫెసర్ జయశంకర్ సాక్షిగా హన్మకొండలో ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి, నియోజకవర్గ నాయకులు శోభారాణి, సోమేశ్వరరావు, కాకిరాల హరిప్రసాద్, రాపాక సత్యనారాయణ, నిరంజన్ రెడ్డి, కుమారస్వామి గౌడ్, అనుముల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ తుది జాబితా విడుదల

### పటాన్‌చెరు అభ్యర్థి మార్పు

ఎట్టకేలకు కాంగ్రెస్ తుది జాబితాను గురువారం రాత్రి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. పటాన్‌చెరు నియోజక వర్గ అభ్యర్థిగా గతంలో ప్రకటించిన నీలం మధను పక్కన బెట్టి ఆయన స్థానంలో కట్టా శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ కేటాయించారు. చార్మినార్‌కు మహ్మద్ ముజీబుల్లా షరీఫ్, మిర్యాలగూడకు బత్తుల లక్ష్మారెడ్డి, సూర్యాపేటకు రామిరెడ్డి దామోదర రెడ్డి, తుంగతుర్తికి ఎస్సీ మందుల సునిల్‌ను అభ్యర్థులుగా ప్రకటించారు. నామినేషన్లకు శుక్రవారం చివరి కావటంతో ఆయా నియోజక వర్గాలలో పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచిన అభ్యర్థులు తుది జాబితాకై ఉత్కంఠగా ఎదురు చూశారు. కాంగ్రెస్ అధిష్టానం తుది జాబితా ప్రకటించటంతో ఆ ఉత్కంఠతకు తెరపడినట్టయింది.

# నామినేషన్లు దాఖలు చేసిన కెసిఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేయగా, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ గురువారం ఉదయం సిరిసిల్లలో నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు కెటిఆర్ హైదరాబాద్ ప్రగతి భవన్‌లో పూజలు చేసి తండ్రి సిఎం కెసిఆర్, తల్లి శోభమ్మల ఆశీర్వాదం తీసుకుని సిరిసిల్లకు బయలుదేరారు. అక్కడి ఆర్డీవో కార్యాలయంలో 11.45 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. నేడు ఆర్మూర్, కొడంగల్‌లో కెటిఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈసారి గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కొద్దిసేపటి క్రితం గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఎర్రవల్లి నుంచి హెలికాప్టర్‌లో గజ్వేల్ చేరుకున్న ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి కామారెడ్డికి బయలుదేరారు. అక్కడ మధ్యాహ్నం 2 గంటలలోపు నామినేషన్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత అక్కడ నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో కెసిఆర్ ప్రసంగించనున్నారు.

# సెంటు భూమి లేదు.. కేసీఆర్ అఫిడవిట్‌లో ఇంకా ఏముందంటే..



కామారెడ్డి - ప్రభాత సూర్యుడు: భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇవాళ నామినేషన్లు వేశారు. గజ్వేల్‌తో పాటు కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఆయన పోటీ చేయనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఉదయం గజ్వేల్‌లో, మధ్యాహ్నం కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేశారు. తొలుత.. గజ్వేల్‌లో ఆర్డీవో కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు కేసీఆర్. ఆపై విశ్రాంతి తీసుకుని హెలికాప్టర్‌లో కామారెడ్డికి చేరుకున్నారు. అక్కడ తొలుత బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చలు జరిపారు. ఆపై కామారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఇక నామినేషన్ సమయంలో సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా కేసీఆర్‌పై తొమ్మిది కేసులు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో జరిగిన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనల అంశంలో కేసులేనని తెలుస్తోంది. ప్రస్తుతం తన చేతిలో రూ. 2లక్షల 96వేల క్యాష్ మాత్రమే ఉన్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ పేర్లపై బ్యాంక్‌లలో డిపాజిట్లు అయిన నగదు రూ. 17కోట్లకు పైగా ఉంది. కేసీఆర్ పేరు మీద మొత్తం తొమ్మిది బ్యాంక్ అకౌంట్స్, శోభమ్మకు మూడు అకౌంట్స్ ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో బ్యాంకు డిపాజిట్లు డబుల్ అయ్యాయి. 2018 ఎన్నికల సమయంలో బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ కలిపి రూ.5.63 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఇప్పుడది మరో 11.16 కోట్లకు పెరిగింది. కేసీఆర్ సతీమణి శోభ చేతిలో 2018 ఎన్నికల సమయంలో రూ.94 వేలు ఉంటే.. ఇప్పుడు రూ.6.29 కోట్లకు చేరింది. బంగారు ఆభరణాలు 2.8 కేజీలు(రూ. 17లక్షలు విలువచేసే) ఉన్నట్లు తాజా అఫిడవిట్‌లో వెల్లడించారు . గత పదేళ్లుగా ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు లేవనికేసీఆర్ అఫిడేవిట్‌లో చూపించారు.స్థిర ఆస్తుల రూపంలో రూ. 17.83 కోట్లు, చరాస్తుల రూపంలో రూ.9.67 కోట్లు ఉన్నాయి కేసీఆర్‌కు. ఆయన భార్య శోభ పేరు మీద రూ.7.78 కోట్ల విలువ చేసే చరాస్తులు ఉన్నాయి. ఉమ్మడి ఆస్తిగా రూ.9.81 కోట్ల మేర చరాస్తులు ఉన్నాయి. కేసీఆర్ పేరు మీద రూ.17.27 కోట్ల అప్పు.. కుటుంబం పేరు మీద రూ.7.23 కోట్ల అప్పు ఉంది. సొంతంగా కారు, బైక్ లేదు కేసీఆర్‌కు.బదులుగా ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, జేసీబీ తదితర వాహనాలు 14 ఉన్నాయి. వీటి విలువ రూ.1.16 కోట్లుగా పేర్కొన్నారు. తనది రైతు కుటుంబం అని, వ్యవసాయం తన వఅత్తి అని చెప్పుకునే కేసీఆర్.. తన పేరు మీద సెంటు భూమి లేదని అఫిడవిట్‌లో ప్రస్తావించడం కొసమెరుపు. కేసీఆర్, ఆయన సతీమని శోభమ్మ పేర్ల మీద ప్రత్యేకంగా ఎలాంటి భూములు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఉన్న భూమంతా కుటుంబ ఉమ్మడి ఆస్తిగా చూపించారు. కేసీఆర్ కుటుంబానికి 62 ఎకరాల భూమి ఉండగా.. అందులో 53.30 ఎకరాల సాగుభూములు, 9.36 ఎకరాల వ్యవసాయేతర భూములు ఉన్నాయి.

# 14 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

**- 21 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన**

**- 23,24 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు**

**- 25న తొలివిడత సీట్ల కేటాయింపు**

**- డిసెంబర్ 4 నుంచి తరగతులు ప్రారంభం**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ నోటిఫికేషన్ శనివారం విడుదల కానుంది. ఈనెల 14 నుంచి లాసెట్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి అధ్యక్షతన లాసెట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఎస్‌కే మహమూద్, వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమేష్‌బాబు లాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 14 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు ధ్రువపత్రాల పరిశీలన కోసం ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలనకు వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ ఉంటుందని వివరించారు. 16 నుంచి 19 వరకు ప్రత్యేక కేటగిరీ (సీఏపీ, ఎన్‌సీసీ) అభ్యర్థులకు హైదరాబాద్‌లో భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. 22న అర్హులైన అభ్యర్థుల వివరాలను పొందుపరుస్తామనీ, ఏమైనా సవరణలుంటే ఈమెయిల్ ద్వారా స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో అభ్యర్థులు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. 25న తొలివిడత సీట్లు కేటాయిస్తామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 29 నుంచి డిసెంబర్ రెండు వరకు కేటాయించిన కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాలని కోరారు. ట్యూషన్ ఫీజును చలానా ద్వారా చెల్లించాలని సూచించారు. వచ్చేనెల నాలుగు నుంచి ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. లాసెట్-2023లో 29,049 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. 26 లా కాలేజీల్లో ఎనిమిది వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడేండ్ల లా కోర్సులో 20,234 మంది ఉత్తీర్ణులైతే, 22 కాలేజీల్లో 4,790 సీట్లు, ఐదేండ్ల లా కోర్సులో 6,039 మంది అర్హత సాధించగా, 19 కాలేజీల్లో 2,280 సీట్లు, పీజీలాసెట్‌లో 2,776 మంది ఉత్తీర్ణులుకాగా, 17 కాలేజీల్లో 930 సీట్లున్నాయి.

# 4 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 4 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 15 రోజులపాటు ఉభయ సభల కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు గురువారం ఆయన తెలిపారు. పార్లమెంటు వ్యవహారాలు, ఇతర అంశాలపై అమృత్‌కాల్‌లో ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్టులను మార్చుతూ ప్రతిపాదించిన బిల్లులపై సమావేశాల్లో చర్చ జరగవచ్చునని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవల ఈ మూడు నివేదికలను హెూంశాఖ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. ఎన్నికల కమిషనర్ల బిల్లు కూడా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఇటీవల ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టుల ఫోన్లపై నిఘా, ఫోన్లను హ్యాక్ చేస్తారని ఐఫోన్ అలర్ట్ మెసేజ్ వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న విడుదల కానుండగా, 4 నుంచి సమావేశాలు ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఐ(ఎం) అభ్యర్థులు నామినేషన్లు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం సీపీఐ(ఎం) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అంతకు ముందుకు ఖమ్మం నగరంలో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హాజరయ్యారు. ఆ సభలో రాష్ట్ర కార్యదర్శి, పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్ ఖమ్మం సమీకతత భవనంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంటన ఆ పార్టీ కేంద్రకమిటి సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ ఉన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా పిట్టల అర్జున్ రావు అశ్వరావుపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరం కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, సీఐటీయూ నాయకులు అప్పారావు, మండల కమిటీ సభ్యులు మడిపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు. మధిర నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా పాలడుగు భాస్కర్ మధిర ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్

# పొంగులేటి ఇంటిపై ఐటీ దాడులు

ఖమ్మం - ప్రభాత సూర్యుడు







ఊహించినట్లుగానే పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఆదాయ పన్నుశాఖ అధికారులు దాడులు చేశారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో చెన్నై, బెంగళూరు నుంచి వచ్చిన ఐటీ అధికారులు పొంగులేటి బంధువుల ఇండ్లతో సహా ఏకకాలంలో ఆయనకు సంబంధించిన కార్యాలయాలు, ఇండ్లు, కళ్యాణ మండపాల్లో సోదాలు చేపట్టారు. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు ఈ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. హైదరాబాద్‌లోని పొంగులేటి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి ఇంటితో పాటు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయాలు, ఖమ్మంలోని ఆయన ఇల్లు, రాఘవ కార్యాలయం, ఎస్‌ఆర్ కనెన్షన్, గార్డెన్స్, ఖమ్మం రూరల్ మండలం సాయిగణేశ్‌నగర్‌లోని పొంగులేటి ఎన్నికల కార్యాలయాలతో పాటు క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ఇల్లు, కల్లూరు మండలం నారాయణపురంలోని ఇల్లు, ఇతరత్ర ఆయన బంధువుల ఇండ్లలోనూ సోదాలు చేపట్టారు. పొంగులేటి సహా ఆయన కుటుంబసభ్యులు భార్య మాధురి, కుమారుడు హర్ష, కుమార్తె స్వప్నీరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి, భార్య శ్రీలక్ష్మి ఖమ్మంలోనే ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ అధికారులు వచ్చీరాగానే కుటుంబసభ్యులతో పాటు సెక్యూరిటీ సిబ్బంది, ఆ సమయంలో అక్కడున్న అందరి ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 8 వాహనాల్లో వచ్చిన 15 మందికి పైగా ఐటీ అధికారులు, పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ఈ దాడులు చేపట్టారు. వారికి కావాల్సిన ఫైల్స్ అన్నీ పొంగులేటి అందజేశారు. ఇంట్లో అన్ని రూమ్‌లనూ జల్లెడ పట్టారు. హైదరాబాద్‌లోని పొంగులేటి ఇల్లు, కార్యాలయాల్లో ఉన్న లాకర్స్ ఓపెన్ చేసేందుకు వేలిముద్ర కోసం గురువారం ఉదయం నామినేషన్ పూర్తయిన వెంటనే ఆయన భార్య మాధురిని హైదరాబాద్ రావాల్సిందిగా అధికారులు కబురు చేశారు. వెంటనే ఆమె అక్కడికి వెళ్లారు. సాయంత్రం ఆయన సోదరుడు ప్రసాదరెడ్డిని సైతం హైదరాబాద్ తీసుకుని వెళ్లారు. కాగా, రెండు, మూడు రోజుల్లో తనపై దాడులు జరుగుతాయని పొంగులేటి చెప్పిన 24 గంటల్లోపే ఐటీ దాడులు చేపట్టడం గమనార్హం. ఇలాంటి దాడులతో కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరని ఈ సందర్భంగా పొంగులేటి అన్నారు. పొంగులేటిపై ఐటీ దాడులు కొనసాగుతున్నాయని తెలిసిన వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకొని గేటు ఎదుట రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. కేసీఆర్ డౌన్ డౌన్.. అంటూ నినాదాలు చేశారు. పొంగులేటి అభిమాని కొమ్ము ఉపేందర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించగా.. అక్కడున్న వారు అడ్డుకొని ఆస్పత్రికి తరలించారు. పొంగులేటి బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు గత ఎన్నికల సందర్భంలోనూ ఆయన ఇంటిపై దాడులు చేశారు. ఇప్పుడు కేసీఆర్ అవినీతిపై నేరుగా ప్రశ్నిస్తుండటంతో ఆయన్ను ఏదో ఒకరకంగా ఇబ్బందులకు గురిచేయాలనే బీఆర్ఎస్ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

# నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: తెలంగాణలో శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. దీంతో పాటు అన్ని పార్టీల నేతలు సకాలంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాన్ని ముమ్మరం చేశాయి. ఓటింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రజా క్షేత్రంలో విమర్శలను ఎదుర్కొంటున్నాయి. వీధులు, కాలనీల్లో ర్యాలీలు, సభలు, సభలు, పాదయాత్రలు నిర్వహిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల పోరులో మాటల యుద్ధం, సవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ప్రచార సీజన్ లో బహిరంగ సభలు, రోడ్ షోలు, జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలతో అంతర్గత సమావేశాలు, స్టార్ క్యాంపెయిన్లు చేస్తూ ఓట్లు దండుకునేందుకు అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలు తుది దశకు చేరుకుంది. ఐదో రోజు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి నామినేషన్ల సందడి నెలకొంది. స్వతంత్ర అభ్యర్థుల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థుల వరకు తమ మద్దతుదారులతో పాటు పెద్ద ఎత్తున తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. అదే సమయంలో ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన కొందరు మరో సారి అదనపు సెట్ దాఖలు చేశారు. బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు చోట్ల నామినేషన్ దాఖలు చేశారు. గజ్వేల్‌లో ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కామారెడ్డి మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 11:45 గంటలకు సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో కేటీఆర్ నామినేషన్ వేశారు. మరో ప్రముఖ టీఆర్ఎస్ నేత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఉదయం సిద్దిపేటలో హరీశ్ రావు నామినేషన్ దాఖలు చేశారు. ఇవాళ ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేశారు. టీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఈటల రాజేందర్ కూడా నామినేషన్ దాఖలు చేస్తున్నారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇక అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. మొత్తం ఐదు రోజుల పాటు నామినేషన్లు స్వీకరించనుండగా, అధికారులు గురు, శుక్రవారాల్లో రెండు రోజులు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ రెండు రోజుల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, ఇతర ప్రముఖులు ప్రధాన పార్టీల నుంచి ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

## వైకుంఠ ద్వార దర్శన టికెట్లతో పాటు గదులూ విడుదల



తిరుపతి- ప్రభాత సూర్యుడు: : తిరుమల శ్రీవారి యాత్రికులకు టీటీడీ శుభవార్త చెప్పింది. డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, శ్రీవాణి దర్శన టికెట్లు, గదుల కోటాను నవంబరు 10న టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టీటీడీ విడుదల చేయనుంది. రోజుకి 22500 చోప్పున పది రోజులుకు 2.25 లక్షల టికెట్లు విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లు విడుదల చేయనుంది. రోజుకి 2 వేల చొప్పున 20 వేల టికెట్లు విడుదల చేయనున్నట్లు టీటీడీ పేర్కొంది. సాయంత్రం 5 గంటలకు వసతి గదులు కోటా విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాలను గమనించాలని టీటీడీ అధికారులు కోరారు. డిసెంబర్ 22న వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతిలో 4.25 లక్షల టైంస్లాట్ సర్వ దర్శన టికెట్లను జారీ చేయనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం వేచి చూస్తున్న యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని టీటీడీ తెలిపింది.


## అభివృద్ధి సంక్షేమ పథకాలే సాక్ష్యం

### సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ రవీందర్ రెడ్డి



**యాచారం-ప్రభాత సూర్యుడు:** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం లో భాగంగా గడపగడపకు తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి మంచిరెడ్డి కిషన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎన్నార్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి , మాజీ ఎంపీపీ వర్త్యావత్ రజిత రాజునాయక్ గ్రామ అధ్యక్షులు పంది సుధాకర్ వార్డు మెంబర్లు ఓరుగంటి రాధిక , బండి ఉమారాణి, తెలగమల్ల అనిత, శోభ , మేకం శంకర్ , గౌర శేఖర్ ,పార్టీ పార్టీ సీనియర్ నాయకులు కొండాపురం శ్రీశైలం నిట్టి బీరప్ప,పేరుమల రమేష్, గణేష్ ఎంజల యాదయ్య , ముచ్చర్ల వెంకటరమణ , చందు , పంది వంశీ, నూకం మహేందర్ ,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజయం సాధిస్తా మెదక్‌ను అభివృద్ధి చేస్తా: మైనంపల్లి



**చిన్నశంకరంపేట్ -ప్రభాత సూర్యుడు:** సిద్దిపేట దొర పెత్తందారితనానికి మెదక్ ఆత్మగౌరవానికి జరిగే పోరాటంలో కచ్చితంగా భారీ మెజార్టీతో మేమే విజయం సాధిస్తామని మైనంపల్లి రోహిత్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మెదక్ లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ వేసి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల పద్మాదేవేందర్ రెడ్డి పరిపాలనలో మెదక్ నియోజకవర్గం 20 సంవత్సరాలు వెనక్కి పోయిందని ఇక్కడ జరగవలసిన అభివృద్ధి అంతా సిద్దిపేటలో జరిగిందని ఆయన అన్నారు. మేము నియోజకవర్గంలో ఏ గల్లికి వెళ్లిన ఏ గ్రామానికి వెళ్లిన ఎక్కడికి వెళ్లినా ప్రజలు స్వాగతిస్తూ అభిమానిస్తూ ఆదరిస్తూ ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు సుప్రభాత రావు, మెదక్ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు మెదక్ సురేందర్ గౌడ్, శంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి , ఉపసర్పంచ్ జీవన్ ముదిరాజ్ , మేడి గణేష్ , మాజి ఎంపీపీ లు పాండరిగౌడ్, అరుణ ప్రభాకర్, మాజీ సర్పంచులు గడిల సుధాకర్ ,మిర్జాపల్లి మనోజ్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ లో హస్తం గెలవడం ఖాయం




**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ తెచ్చింది ఇచ్చింది కాంగ్రెస్సేనని కెసిఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని భారీ మెజార్టీతో హస్తం గెలవడం ఖాయమని కుత్బుల్లాపూర్ లోని ఐడిపిఎల్ రాయల్ ప్యాలెస్ లో వేలాదిమంది కార్యకర్తల తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి కొలను హానుమంత్‌రెడ్డి అన్నారు. అనంతరం రాయల్ ప్యాలెస్ నుండి మున్సిపల్ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, కె ఎం ప్రతాప్,పార్టీ సీనియర్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి,సొంటి రెడ్డి పున్నారెడ్డి, కె.పి విశాల్, శ్రవణ్ కుమార్ ,జహంగీర్ భాయ్, సంతోష్ ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి, కొలను రాజశేఖర్ రెడ్డి, నిజాంపేట్ కొలను శ్రీనివాస్ రెడ్డి మరియు ఎన్ఎస్ యుఐ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# 15 సంవత్సరాల ప్రశాంతతకు విఘాతం

### ఇబ్రహీంపట్నం నామినేషన్ ర్యాలీలో ఉద్రిక్తత




**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు:** గత 15 సంవత్సరాలుగా ప్రశాంతంగా ఉన్నటువంటి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని కాంగ్రెస్ నాయకులు ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ల సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నం కేంద్రంలో బిఆర్ఎస్ నాయకుల, కార్యకర్తలపై కాంగ్రెస్ వర్గాల దాడిపై మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలు కావాలని బిఆర్ఎస్ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, బిఆర్ఎస్ నామినేషన్ ర్యాలీకి హాజరైన కార్యకర్తలను చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అశేషంగా పాల్గొన్న జనాన్ని చూసి అక్కసుతో ఘర్షణ వాతావరణం సృష్టించాలనే ఉద్దేశంతో రాళ్ల దాడి చేశారని అన్నారు. మూడుసార్లుగా ఎమ్మెల్యేగా గెలిచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని శాంతియుతంగా ముందుకు తీసుకెళ్తూ ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేశామని, అలాంటిది నేడు ప్రత్యర్థి కాంగ్రెస్ నాయకులు అల్లకల్లోలం సృష్టించారని విమర్శించారు. ఇలాంటివారు ఎమ్మెల్యేలుగా గెలుపొందితే నియోజకవర్గం ప్రజలు భయం గుప్పిట్లో బ్రతకాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో 36 మంది టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, అలాగే పోలీసులు కూడా గాయపడ్డారని అన్నారు. ఇలాంటి దాడులకు భయపడేది, సహించేది లేదని హెచ్చరించారు. దాడులకు పాల్పడ్డ వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రజాక్షేత్రంలో గెలుపొంది కాంగ్రెస్ నాయకులకు సరైన గుణపాఠం చెప్తామని, దాడుల్లో గాయపడ్డ ప్రతి బిఆర్ఎస్ కార్యకర్తకు అండగా నిలుస్తామని అన్నారు.

# ఇబ్రహీంపట్నం నామినేషన్లలో తీవ్ర ఉద్రిక్తత

- నామినేషన్ల సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల భారీ ర్యాలీ
- ఇరు పార్టీల కార్యకర్తల పరస్పర రాళ్లదాడి
- మహిళలకు,పోలీసులకు గాయాలు
- లాఠీ చార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు







**ఇబ్రహీం పట్నం/రంగారెడ్డి :- ప్రభాత సూర్యుడు**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా గురువారం ఇరు పార్టీల నడుమ తీవ్ర ఘర్షణ ఏర్పడింది. నామినేషన్ వేసేందుకు బిఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డిలు కార్యకర్తలతో భారీ ర్యాలీగా ఒకే సారిగా తరలి వచ్చారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇరు వర్గాలకు చెందిన ర్యాలీలు ఎదురు వెదురు పడడంతో పోటాపోటీగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరువర్గాల కార్యకర్తలు ఒక్కసారిగా రెచ్చిపోవడంతో ఘర్షణ చెలరేగింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఒకరికొకరు జండా కర్రలు, రాళ్లు విసురుకుని పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ దాడులలో పోలీసులకు ,మహిళలకు,కార్యకర్తలకు గాయాలయ్యాయి. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలపై లాఠీ చార్జి చేసి చెదరగొట్టారు.

# దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

### కాంగ్రెస్ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంప ట్నం - ప్రభాత సూర్యుడు**

ఓడిపోతారని భయంతో ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం నామినేషన్ల సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య జరిగిన దాడి అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. నీ దాడులపై స్పందించిన కాంగ్రెస్ అభ్యర్థి మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం దగ్గరకు రాగానే తమ వాహనాల, కార్యకర్తలపై రాళ్లతో బిఆర్ఎస్ కార్యకర్తలు దాడులకు దిగారని అన్నారు. ఓడిపోతాననే భయంతో మంచిరెడ్డి కిషన్ రెడ్డి నాపై దాడులకు పాల్పడ్డాడని అన్నారు. ఈ దాడి విషయంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని బిఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లతో దాడి చేస్తుంటే పోలీసులే భయపడి పారిపోతున్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు విసురుతుంటే ఆపలేక తిరిగి కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురు దాడి చేశారని అన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలది సరైన పద్ధతి కాదని వీరిపై వెంటనే పోలీసు కమిషనర్ చర్యలు తీసుకోవాలని వారికి డ్యూటీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్,కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు



**ఇబ్రహీంపట్నం/రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు**

నామినేషన్ల గడువు ముగిస్తుండడంతో ఇబ్రహీం పట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి భారీ ర్యాలీలతో గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో అభ్యర్థులు ఇరువురు బి ఫాం, నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డికి అందజేశారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215